క్లుప్తంగా

మన్యంలో పెరిగిన చలి తీవ్రత



సీతంపేట మన్యంలో కురుస్తున్న మంచు

సీతంపేట: మన్యంలో చలి తీవ్రత రోజు రోజుకు పెరిగిపోతోంది. దీంతో పాటు కొన్నిరోజులుగా పొగమంచు కూడా విపరీతంగా కురుస్తుండడం గమనార్హం. ఉదయం, సాయంత్రం వేళల్లో చలి బాగా ఉండడంతో గిరిజనులు మంటలు వేసి చలికాగుతున్నారు. శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్న వారంతా అప్రమత్తంగా ఉండాలని, మంచులో ఎక్కువగా తిరగకూడదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

తాలాడలో ఏనుగుల సంచారం



మొక్కజొన్న పంట వైపు దూసుకువస్తున్న ఏనుగులు

భామిని: మండలంలోని తాలాడ గ్రామంలో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. శనివారం ఓ ఆరేడు ఏనుగులు కలిసి అక్కడి మొక్కజొన్న పంటను ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు బి.సంజీవరావు, బి.కిరణ్‌కుమార్ తెలిపారు. గజరాజుల రాకతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత 'బర్ణ'



విజేత జట్టు సభ్యులకు ట్రోఫీ అందజేస్తున్న రాజేంద్ర

వీరఘట్టం: సంక్రాంతి సందర్భంగా మండలంలోని హుస్సేన్‌పురంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీలకు దాదాపు 8 జట్లు హాజరు కాగా, ఫైనల్స్‌లో పాట్లి, బర్ణ గ్రామాల జట్లు తలపడ్డాయి. ఫైనల్ పోరులో బర్ణ గ్రామ జట్టు గెలిచి, టోర్నీ విజేతగా నిలిచింది. విజేత జట్టుకు నిర్వాహకులు సైఫోర్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పక్కి రాజేంద్ర ట్రోఫీ, నగదును బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కొయ్యాన రాము, నాచు రాజు, పక్కి చిన్న తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తున్న ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

పార్వతీపురం టౌన్: దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఉపకరణాలు ఎంతో ఉపయోగపడతాయని ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన ఉపకరణాలను డీఈఓ కార్యాలయం వద్ద ఆయన శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చి విద్యార్థులకు అండగా నిలుస్తుందన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఉపయోగపడేలా జిల్లాకు 490 ఉపకరణాలు అందజేసిందన్నారు. రూ.30లక్షల విలువ గల ట్రైసైకిళ్లు, 35 వీల్‌చైర్లు, 15 యంత్రాలు, 222 టీఎల్ఎం కిట్లు, 228 హియరింగ్ మిషన్లు, బ్రైలీ కిట్లు 15 ఉపకరణాలను విద్యార్థులకు అందజేసినట్టు తెలిపారు. పాఠశాలల ఆధునికీకరణకు నాడు - నేడు రెండో విడత పనుల్లో భాగంగా 414 పాఠశాలలకు రూ.144.60కోట్లు మంజూరు చేసిందన్నారు. పది పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఈడీ కోఆర్డినేటర్ భానుమూర్తి, సెక్టోరియల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'పాగిరి'



ట్రోఫీతో విజేత జట్టు సభ్యులు

రాజాం సిటీ: మండలంలోని పాగిరి గ్రామంలో కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. సాయంత్రం పాగిరి-1, పాగిరి-2 జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో పాగిరి-1 జట్టు గెలుపొంది, టోర్నీ విజేతగా నిలిచింది. అనంతరం విజేత జట్టుకు నిర్వాహకులు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేశారు.

భోగి మంట.. భోగాల పంట



కురుపాంలో భోగి పండగ సందడి

పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో భోగి పండగ శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున అందరూ లేచి, తలంటు స్నానం ఆచరించి, భోగి మంటలు వేశారు. చలి కాగుతూ పిడకలు, పాత సామాన్లు మంటల్లో వేసి, అరిష్టం పోయి భోగ భోగ్యాలు ప్రసాదించాలని భగవంతుడిని వేడుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్



కురుపాం: జేసీసీ వీధిలో భోగి మంట



గరుగుబిల్లి: ఉల్లిబద్రలో వేసిన భోగి మంట



జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో భోగి మంట వద్ద చలి కాగుతున్న గ్రామస్తులు



భామిని: భోగి మంట వద్ద చలికాగుతున్న కొరమ గ్రామస్తులు



భామిని: నేరడి-బి గ్రామంలో వేసిన భోగి మంట



పాలకొండ రూరల్: భోగి మంట వద్ద ఆంజనేయనగర్ కాలనీవాసులు



వీరఘట్టం: బార్నాల వీధిలో భోగి మంట దగ్గర స్థానికుల సందడి

కనుచూపు మేర.. మంచు తెర



వీరఘట్టం రోడ్డులో లైట్లు వేసుకుని వస్తున్న వాహనదారులు



పాలకొండ పట్టణ ప్రధాన రహదారిలో కురుస్తున్న పొగమంచు



శ్రీకాకుళం రోడ్డులో సాలెగూడుపై పడిన మంచు



పాలకొండలో దట్టంగా కురుస్తున్న మంచు



సీతంపేట రోడ్డులో ఆవరించిన మంచు

పాలకొండ పట్టణం దాని పరిసర ప్రాంతాల్లో శనివారం కనుచూపు మేర మంచు ఆవిరించిన దృశ్యాలు పలుచోట్ల కనిపించాయి. విపరీతంగా పొగమంచు కూడా ఉండడంతో రోడ్లుపై వెళ్లే వాహనదారులు లైట్లు వేసుకుని మరీ ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. పొగమంచు కారణంగా పాలకొండలోని సీతంపేట, శ్రీకాకుళం, వీరఘట్టం ప్రధాన రోడ్లు పూర్తిగా కనిపించకపోవడం గమనార్హం. - పాలకొండ/పాలకొండ రూరల్ సాక్షి నెట్‌వర్క్

వైభవంగా గోదాదేవి కల్యాణం



పాలకొండ రూరల్: గోదాదేవి కల్యాణ దృశ్యం



పాలకొండ: ప్రత్యేకాలంకరణలో దేవతామూర్తులు

పాలకొండ రూరల్: పట్టణంలోని సీతా రామాలయంలో గోదాదేవి కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన ఈ కార్యక్రమం చూసేందుకు భక్తులు పోటెత్తారు.

పాలకొండ: పట్టణంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో గోదా దేవి కల్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా భోగి పండగ రోజు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని చూసేందుకు భక్తులు తరలివస్తారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుము సాగిన కల్యాణ వైభవాన్ని ప్రజలు తిలకించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

ఇండియన్ హెర్క్యులస్‌కు ఘననివాళి



కోడి రామ్మూర్తినాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న తెలగవీధి ప్రజలు

వీరఘట్టం: పట్టణంలోని తెలగవీధిలో ప్రపంచ మల్ల యోధుడు, ఇండియన్ హెర్క్యులస్ కోడిరామ్మూర్తి నాయుడు వర్ధంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి వీధి ప్రజలు పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం కళియుగ భీముడిగా పేరొందిన కోడిరామ్మూర్తి జీవిత చరిత్రలోని ముఖ్య సంఘటనలు, ధైర్యసాహస కృత్యాలను వక్తలు వివరించారు. అలాగే ఎమ్మార్సీ, జెడ్పీ హైస్కూల్ వద్ద కూడా కోడిరామ్మూర్తినాయుడు వర్ధంతి నిర్వహించి, నివాళులర్పించారు.

• వస్త్రదానం



పాలకొండ రూరల్: పేదలకు బట్టలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న జల్లు నారాయణరావు



సీతంపేట: వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న గడ్డెయ్య

పాలకొండ రూరల్: పట్టణంలోని పేదలకు గీతాపారాయణ సభ్యుడు జల్లు నారాయణరావు శనివారం వస్త్రదానం చేశారు. మానవ సేవే మాధవ సేవ అని పండగ పూట నిరుపేదలకు ఇలా దుస్తుల పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని దాత అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తుమ్మగుంట శంకరరావు, కడగల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

సీతంపేట: మండల కేంద్రంలోని వృద్ధులకు యువమిత్ర సర్వీస్ సొసైటీ డైరెక్టర్ గొర్లె గడ్డెయ్య శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతిఏటా భోగి పండగ సందర్భంగా వీటిని అందిస్తుండడం చాలా ఆనందంగా ఉందని దాత అన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు గొర్లె సుజాత, కో-ఆర్డినేటర్ గంధవరపు అప్పలనరసమ్మ పాల్గొన్నారు.

• అ'పూర్వ' కలయిక



ఎలైట్ కాలేజీలో 1996-పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. దాదాపు 24 సంవత్సరాల తర్వాత ఒకరినొకరు చూసుకోవడంతో ఎంతో సంతోషంగా తమ చిన్ననాటి స్మృతులు గుర్తు చేసుకున్నారు. - పాలకొండ రూరల్

మన చేతుల్లోనే మన ఆరోగ్యం



బ్యానర్ ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్న విషయం ప్రజలు గుర్తించాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలో ఆయన గృహంలో గ్రీన్ వరల్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒమిక్రాన్ బీఎఫ్ 7 పై అవగాహన బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మాస్కు ధరించడం, బూస్టర్ డోస్ వేసుకోవడం, వీలైనంత వరకు భౌతిక దూరం పాటించడం వంటి కోవిడ్ నియమాలు పాటించాలని కోరారు. కోవిడ్ 19 వెరియంట్ బీఎఫ్ 7 నుండి రక్షణకు ప్రజలు భాద్యతగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు, నాయకులు సంతోష్‌కుమార్ శర్మ, పిరిడి రామక్రిష్ణ, పిట్ట వాసు, సురేష్, శ్రీను తదితరులు ఉన్నారు.

పల్లెల్లో సంక్రాంతి సంబరాలు



సంగంవలసలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



సంగంవలసలో క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్టు

పార్వతీపురం టౌన్: మండలంలో సంక్రాంతి పండుగ సాంప్రదాయ క్రీడల్లో భాగంగా సంగంవలస, ఎస్.ములగ, ఎమ్మార్‌నగరం, చినబొండపల్లి గ్రామాల్లో యువత ఆధ్వర్యంలో చైర్‌గేమ్, ముగ్గులు, నృత్య పోటీలు శనివారం నిర్వహించారు. పోటీల్లో మహిళలు, యువత పాల్గొన్నారు. చిన్నారులు నృత్య ప్రదర్శన చేయగా, మహిళలు రంగవల్లులు వేశారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సీతానగరం: మండలంలోని ఇప్పలవలస గ్రామంలో శనివారం రాత్రి వేంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సంస్థ ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో ఏటా భోగి పండుగ రోజున స్వామి వారి కల్యాణం చేయడం ఆనవాయితీ. లోక కల్యాణార్థం నిర్వహించిన స్వామి వారి కల్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.